# సాక్షి జనగామ

ఆదివారం | 29 | డిసెంబర్ | 2024






## హోరాహోరీగా క్రీడాపోరు

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. - 8లో▸



## రిసోర్స్ సెంటర్ల పాత్ర కీలకం

దేశాభివృద్ధిలో యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆ రిసోర్స్ సెంటర్ (గౌహతి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అశ్వినిశర్మ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
29.0$^{0}$ /17.0$^{0}$

## వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

# నిరంతర పెట్రోలింగ్

## డిసెంబర్ 31 రాత్రి అడుగడుగునా పోలీసు పహారా

ప్రశాంతంగా నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకుందాం..

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా ● సాక్షి ఫోన్ ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన

పెట్రోలింగ్, బందోబస్తుపై ప్రశ్నించిన ప్రజలు ● సందేహాలు నివృత్తి చేసిన సీపీ

ఈ ఏడాది నూతన సంవత్సర వేడుకల్లో ఏ చిన్న దుర్ఘటన జరగకుండా బందోబస్తు నిర్వహించేందుకు పోలీస్‌శాఖ సిద్ధమవుతోంది. పోలీసులు ఎక్కడికక్కడ పెట్రోలింగ్ నిర్వహిస్తారు. అన్ని ప్రాంతాల్లో పకడ్బందీగా చర్యలు చేపడతారు. ప్రతీ ఏడాది డిసెంబర్ 31 వస్తుంది. జనవరి 1 వస్తుంది. ఇదే చివరిది కాదు. మొదటిది కాదు. ఎంజాయ్ పేరిట జీవితాలను ఆగం చేసుకోవద్దు..

...అని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. డిసెంబర్ 31, నూతన సంవత్సర వేడుకల నిర్వహణలో పోలీస్ శాఖాపరంగా తీసుకుంటున్న చర్యలు, ప్రజలు శాంతియుతంగా జరుపుకునేందుకు పాటించాల్సిన జాగ్రత్తలపై శనివారం 'సాక్షి' ఫోన్ ఇన్ ప్రోగ్రాం నిర్వహించింది. వరంగల్ కమిషనరేట్ (వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాలు) పరిధి ప్రజలు సీపీతో నేరుగా మాట్లాడి సందేహాలు నివృత్తి చేసుకున్నారు. వాటిలో ముఖ్యమైనవి ఇలా..

- వరంగల్ క్రైం


ఫోన్‌లో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

సాక్షి ఫోన్ ఇన్

**ప్రశ్న:** డిసెంబర్ 31 సందర్భంగా గ్రామాల్లో కూడా యువకులు రోడ్లపై పెద్దగా అరుస్తూ బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. వీటిని కట్టడి చేస్తున్నారా?
– గంగారం సురేశ్ (నడికూడ), పి.ప్రశాంత్ (పరకాల)

**సీపీ:** బహిరంగంగా మద్యం సేవించడం చట్ట విరుద్ధం. అది గ్రామాల్లో అయినా.. పట్టణంలో అయినా నేరమే. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజాప్రతినిధులు, విలేజ్ పోలీస్ అధికారుల ద్వారా తెలియజేశాం. డిసెంబర్ 31 రాత్రి ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా కలిసికట్టుగా వేడుకలు నిర్వహించుకోవాలి. ఎలాంటి వివాదాలకు తావు ఉండొద్దు.

**ప్రశ్న:** జనగామలోని బతుకమ్మ కుంట, మినీ స్టేడియం ప్రాంతంలో వేడుకల సందర్భంగా బందోబస్తు పెంచాలి? – యు.సందీప్ (జనగామ)

**సీపీ:** కచ్చితంగా అవసరం ఉన్న ప్రతీ చోట బందోబస్తు పెంచుతాం. పెట్రోలింగ్ నిర్వహిస్తాం. రాత్రి పూట మహిళలు దేవాలయాలు, చర్చీలకు ప్రార్థనల కోసం వెళ్లి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం. షీటీమ్స్ పోలీసులు మఫ్టీలో ఉంటారు.

**ప్రశ్న:** డిసెంబర్ 31, జనవరి 1 రోజున వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్లు మూసేస్తే బాగుంటుంది?
– శ్రీకాంత్ (హనుమకొండ)

**సీపీ:** వైన్స్, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వహణ బాధ్యత ఎక్సైజ్ శాఖది. పోలీసులు కేవలం ఎన్‌ఫోర్స్‌మెంట్ చేస్తారు. డిసెంబర్ 31రోజున ఎక్సైజ్ శాఖ రాత్రి 12 గంటల వరకు అనుమతి ఇచ్చింది. ఆ తర్వాత ఎవరైనా నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న:** యువత నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మద్యం మత్తులో వాహనాలు వేగంగా నడిపి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ఇలాంటివి జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటారు? – మహేందర్ (ఎర్రగట్టుగుట్ట, హసన్‌పర్తి)

**సీపీ:** జీవితంలో డిసెంబర్ 31 అనేది చివరి రోజు కాదు. జనవరి 1 మొదటిది కాదు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 31 వస్తుంటుంది.. పోతుంటుంది. దానికి ఇదే చివరిది అనుకుని ఎంజాయ్ అనే పేరుతో జీవితాలను అంధకారం చేసుకోవద్దు. తల్లిదండ్రులు పిల్లలకు అర్ధరాత్రి పూట వాహనాలు ఇవ్వొద్దు. మద్యం సేవించిన తర్వాత అసలు ఇవ్వొద్దు. రోడ్లపై పోలీసులు వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్ని అడుగడుగునా నిర్వహిస్తారు. కాబట్టి అర్ధరాత్రి రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడొద్దు.

**ప్రశ్న:** డీజే సౌండ్స్‌తో ఇబ్బందులు పడుతున్నాం. వేడుకల పేరిట చాలా మంది రాత్రి నిద్ర లేకుండా చేస్తున్నారు. మీరు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? – శ్రీనివాస్, (ఈఎస్ఐ ఆస్పత్రి ప్రాంతం, వరంగల్)

**సీపీ:** నూతన సంవత్సరం సందర్భంగా డీజేల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవు. రాత్రి పూట ఎక్కడ డీజే సౌండ్స్ పెట్టినా వాటిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకుంటారు. సంతోషం కోసం చిన్న చిన్న మ్యూజిక్ పెట్టుకోవచ్చు. ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులు పడితే డయల్ 100కు సమాచారం ఇవ్వండి. పరిష్కారం లభిస్తుంది.

**ప్రశ్న:** స్నేహితులు, బంధువులతో కలిసి పార్టీలు చేసుకోవడానికి అనుమతి తీసుకోవాలా? – రమేశ్ (హనుమకొండ) కుమారస్వామి, సంగెం

**సీపీ:** ఎంత మంది కలిసి పార్టీ చేసుకుంటున్నారు? ఎలాంటి పార్టీ అనే విషయాలు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారు అనుమతి తీసుకుని ముందుకు సాగాలి. పార్టీల్లో డీజేలు పెట్టవద్దు. పార్టీలకు అనుమతి స్థానిక పోలీసుల పరిధిలోనే ఉంటుంది. ఎక్కువ మంది గ్యాదర్ అయితే ఏసీపీతో అనుమతి తీసుకోవాలి. ప్రజలంతా సంతోషంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి.

**ప్రశ్న:** డిసెంబర్ 31న రాత్రి బందోబస్తుకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?
– ఇసంపల్లి శంకర్ (క్రిస్టియన్ కాలనీ, వరంగల్), బంగారు భీంరావు (జనగామ), కరుణాకర్‌రెడ్డి, యాకంరెడ్డి, ఎ.శ్రీనివాస్ (బచ్చన్నపేట)

**సీపీ:** ట్రైసిటీ పరిధితోపాటు ఆయా మండల కేంద్రాల్లో డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తాం. గ్రామాల్లో సైతం పెట్రోలింగ్ ఉంటుంది. మద్యం మత్తులో వాహనాలు నడిపే వ్యక్తుల నుంచి వాహనాలు స్వాధీనం చేసుకుంటాం. షీటీమ్స్ పోలీసులు మఫ్టీలో ఉంటారు. అన్ని స్థాయిల పోలీసులు దాదాపు జనవరి 1 ఉదయం 6 గంటల వరకు రోడ్లపైనే ఉంటారు. డీసీపీ స్థాయి వరకు అధికారులంతా బందోబస్తు పర్యవేక్షిస్తారు.

## న్యూస్‌రీల్

### నేడు 3కే రన్

జనగామ రూరల్: డ్రగ్స్‌పై అవగాహన, రోడ్డు ప్రమాదాల నివారణకు వాక్, 3కే రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు. శనివారం బతుకమ్మకుంట వద్ద వాకర్స్, యువతకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేడు (ఆదివారం) ఉదయం 6 గంటలకు వాక్, 3కే రన్ ప్రారంభమవుతుందని, పట్టణ ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### గృహ నిర్మాణ శాఖ పీడీగా మత్రునాయక్



జనగామ: జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ (పీడీ)గా ఏ.మత్రునాయక్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న మత్రునాయక్ పదోన్నతిపై జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న పీడీ దామోదర్‌రావు సిద్దిపేటకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన పీడీ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

### మెరుగైన సేవలందించాలి




జనగామ రూరల్: జాతీయ ఆరోగ్య సూచనలు పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్ఓ మల్లికార్జున రావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో డిప్యూటీ డీఎంహెచ్ఓతో కలిసి మెడికల్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎంహెచ్ఎల్పీలతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ అన్ని పీహెచ్‌సీ సెంటర్‌లతో వందశాతం ఇమ్యూనైజేషన్ చేపట్టాలన్నారు. రాష్ట్రంలో జిల్లాకు మంచి గుర్తింపు తీసుకువచ్చేలా పనితీరును మెరుపర్చుకోవాలని పీహెచ్‌సీ సెంటర్ల ఇన్‌చార్జ్‌లకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల పీహెచ్‌సీ డాక్టర్లు, ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మోకాళ్లపై నిల్చొని నిరసన

జనగామ రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మోకాళ్లపై నిల్చొని వినూత్న నిరసన తెలిపారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 19వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లచీరలు, దుస్తులు ధరించి మోకాళ్లపై నిలబడి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు తాడురూ రమేశ్ మాట్లాడారు. ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి దయాకర్, జిల్లా బాధ్యులు గోరంట్ల యాదగిరి, వెంకటేశ్వర్లు, నరేష్, అన్నపూర్ణ, మహాలక్ష్మి, ప్రశాంతి, రమ్య సుకన్య, నవీన, రాజు, రాజకుమార్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

### 1098 ఆకారంలో విద్యార్థినులు



జనగామ రూరల్: మహిళా సాధికారత కేంద్రం, సఖీ సెంటర్ ఆధ్వర్యంలో శనివారం చౌడారం కేజీబీవీ బాలికలు వినూత్నంగా అవగాహన కల్పించారు. బాలికల అక్రమ రవాణా, బాల్య వివాహాలు అరికట్టడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 ఆకారంలో కూర్చుని అవగాహన కల్పించారు. అలాగే మహిళలు హింసకు గురయితే మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181కు కాల్ చేసి రక్షణ పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం లో జెండర్ స్పెషలిస్ట్ పవిత్ర, హేమలత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

### పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలు


గాయాలపాలైన సత్యలక్ష్మి

నర్మెట: పిచ్చికుక్క దాడిలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన నర్మెట మండలం వెల్దండలో శనివారం చోటు చేసుకుంది. డబుల్ బెడ్ రూం కాలనీవాసులైన బోదాసు సత్యలక్ష్మి ఇంటి ముందు పనుల్లో నిమగ్నమై ఉండగా పిచ్చికుక్క ఆమె మోచేతిని గాయపరిచింది. ఆమె అరవడంతో వదిలి కొద్ది దూరంలో ఆడుకుంటున్న బాలుడు గోల్కొండ రిషిపై దాడి చేసి ముఖంపై తీవ్రంగా గాయపరిచింది. వెంటనే కాలనీవాసులు వారిద్దరిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వార్షిక నివేదిక వెల్లడిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా



# నేరాలు తగ్గుముఖం

## కమిషనరేట్‌లో స్వల్పంగా (3.21 శాతం) తగ్గుదల

- గత ఏడాదికంటే హత్యలు 16.67 శాతం, హత్యాయత్నాలు 17.06 శాతం లెస్
- రోడ్డు ప్రమాదాలు 9.53 శాతం..
- రూ.2.63 కోట్ల గంజాయి స్వాధీనం
- చోరీ సొత్తు రికవరీలో వెనుకబాటు
- నేర వార్షిక నివేదిక విడుదల చేసిన సీపీ

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గత ఏడాది కంటే 3.21 శాతం నేరాలు తగ్గాయని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. శనివారం ఉదయం పోలీస్ కమిషనరేట్‌లో సీపీ 2024 క్రైమ్ నివేదికను విడుదల చేశారు. ముందస్తు ప్రణాళికలు, పక్కా సమాచారంతో నేరాలను పూర్తిస్థాయిలో నియంత్రించినట్లు సీపీ ప్రకటించారు. 2023లో 14,731 కేసులు నమోదు కాగా ఈ ఏడాది 14,406 కేసులు నమోదై 3.21శాతం తగ్గదల ఉన్నట్లు తెలిపారు. హత్య కేసులు 16.67 శాతం, ఆస్తినేరాలు 2.23 శాతం తగ్గాయని వివరించారు. ముందస్తు చర్యల వల్ల 147 కేసుల్లో రూ.2.63 కోట్ల విలువైన గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సాక్ష్యాధారాలతో 2,462 మందికి వివిధ కేసుల్లో జైలుశిక్షలు పడినట్లు తెలిపారు.

**మావోయిస్టుల లొంగుబాటు..**

సీపీ ఎదుట నలుగురు మావోయిస్టు పార్టీ నేతలు లొంగిపోయారు.

- జూన్ 14న మావోయిస్టు పార్టీ ఏసీఎం తిక్క సుస్మిత లొంగిపోయింది. ఈమెపై రూ.4 లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించింది. ఇదే రోజున మడకం దూల ఏసీఎం లొంగిపోయాడు. ఇతనిపై రూ. 4 లక్షల రివార్డు ఉంది.
- ఆగస్టు 29న బూజుగుండ్ల అనిల్, ఏసీఎం లొంగిపోయాడు. ఇతనిపై రూ. 4 లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించింది.
- నవంబర్ 14న స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు కొడి మంజుల అలియాస్ నిర్మల్ లొంగిపోయింది. ఈమెపై రూ.20 లక్షల రివార్డును ప్రభుత్వం ప్రకటించింది.

**నేరాల నమోదు ఇలా....**

హత్యలు, హత్యాయత్నాల్లో తగ్గుదల

| అంశం | 2023 | 2024 | శాతం |
|---|---|---|---|
| హత్యలు | 48 | 40 | 16.67 ▼ |
| హత్యాయత్నాలు | 129 | 107 | 17.06 ▼ |
| గొడవలు | 1573 | 1600 | 2.69 ▲ |
| గుంపు గొడవలు | 77 | 56 | 27.28 ▼ |

మహిళలపై దాడులు ఇలా..

| అంశం | 2023 | 2024 | శాతం |
|---|---|---|---|
| వేధింపులు | 658 | 624 | 34 ▼ |
| లైంగికదాడి | 189 | 143 | 46 ▼ |
| వరకట్న హత్యలు | 20 | 10 | 10 ▼ |
| వేధింపులు | 402 | 364 | 38 ▼ |
| మొత్తం | 1269 | 1141 | 11 ▼ |

**చోరీ సొత్తుల రికవరీలో వెనుకబాటు..**

వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో జరిగిన బ్యాంకు చోరీ రాష్ట్రంలో పెద్ద సంచలనంగా మారింది. ఈ ఏడాది కమిషనరేట్ పరిధిలో జరిగిన వివిధ చోరీలకు సంబంధించి 18 రాష్ట్రాలకు చెందిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. గత సంవత్సరం చోరీ సొత్తు రికవరీ 42.13 శాతం ఉండగా .. ఈ ఏడాది 29.10 శాతం నమోదైంది. 13.03 శాతం తగ్గింది.

| అంశం | 2023 | 2024 |
|---|---|---|
| నమోదైన కేసులు | 927 | 948 |
| ఛేదించిన కేసులు | 584 | 519 |
| చోరీ సొత్తు | రూ.9,94,62,912 | రూ.24,68,26,130 |
| రికవరీ సొత్తు | రూ.4,19,03,727 | రూ.7,18,34,683 |

**తగ్గిన ప్రమాదాలు.. మరణాలు**

| అంశం | 2023 | 2024 | తగ్గుదల |
|---|---|---|---|
| రోడ్డు ప్రమాదాలు | 460 | 417 | 9.35 శాతం |
| మరణాలు | 499 | 439 | 12.03 శాతం |
| గాయాలు | 1,398 | 1,395 | 0.22 శాతం |

**సైబర్ కేసుల్లో రికవరీ అంతంతే..**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ మాయగాళ్ల మాటలకు పెద్ద ఎత్తున ప్రజలు మోసపోయారు. ఈ కేసుల్లో కోల్పోయిన డబ్బుల రికవరీ చాలా తక్కువ. సైబర్ క్రైం పోలీసులు తమిళనాడుకు చెందిన జనీల్, ప్రీతి దంపతులను అరెస్ట్ చేశారు. వీరు 150 కేసుల్లో సుమారు రూ.15 కోట్లను కొల్లగొట్టారు.

| అంశం | కేసులు | పోయిన సొత్తు | రికవరీ | శాతం |
|---|---|---|---|---|
| 2023 | 1,091 | రూ.18,71,29043 | రూ.1,20,172376 | 6.42 |
| 2024 | 772 | రూ.24,70,43738 | రూ.1,29,88086 | 5.25 |

**షీటీమ్స్‌తో ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట..**

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో షీటీమ్స్ సత్ఫలితాలు ఇస్తున్నాయి. ముఖ్యంగా ట్రైసిటీ పరిధిలో మహిళలు, యువతులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో మఫ్టీలో పోలీసులు ఉండి ఆకతాయిలను అదుపులోకి తీసుకుంటున్నారు. వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఈ ఏడాది 18 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, 126 మందిపై పెట్టి కేసులు నమోదు చేశారు. 150 మందిని అరెస్టు చేశారు. షీటీమ్స్ ఆధ్వర్యంలో 173 అవగాహన సదస్సులు నిర్వహించారు.

రివైండ్ 2024

మహబూబాబాద్ జిల్లాలో వర్షాలతో రాళ్లు, ఇసుక మేట వేసిన వరిపొలం (ఫైల్)



# ఒడిదొడుకుల సాగు

- అతి వృష్టితో రైతులు అతలాకుతలం
- తగ్గిన పత్తి, పెరిగిన వరి సాగు
- రుణమాఫీ, సన్నాలకు బోనస్‌తో ఊరట
- రైతు భరోసా కోసం తప్పని ఎదురు చూపులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2024– సాగు తీరు

- వివరాలు 8లో▸

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది రైతులు కొంచెం తీపి.. మరికొంచెం చేదు అనుభవం ఎదుర్కొన్నారు. అతివృష్టితో పంటలు ఆగమాగం..చెరువులు, వాగులు తెగి పంట నీటిపాలైంది. చేసిన కష్టం నేలపాలు కావడంతో రైతులు మొండిధైర్యంతో పోయిన దగ్గరే వెతుక్కోవాలన్న ఆశతో వరిసాగుపై దృష్టి పెట్టారు. పత్తి సాగును తగ్గించి.. వరిసాగును పెంచారు. రుణమాఫీ అయిన వారు సంబురపడ్డారు, కానివారు ఎదురు చూస్తున్నారు. సన్న ధాన్యానికి బోనస్ అందించడం ఊరట కలిగించే అంశం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది (2024) సాగిన ఒడిదొడుకుల సాగుపై 'సాక్షి' మననం. - సాక్షి, మహబూబాబాద్

## చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్


వివరాలు వెల్లడిస్తున్న రాజమహేంద్రనాయక్

పాలకుర్తి టౌన్: చోరీ చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్రనాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. మండలంలోని వావిలాలకు చెందిన కరణం సాయికుమార్ దొంగతనాలు చేయడం వృత్తిగా ఎంచుకున్నాడు. 2023 ఫిబ్రవరిలో జైలుకు వెళ్లి 2024 సెప్టెంబర్‌లో బయటకు వచ్చాడు. ఈ నెల 18న పాలకుర్తి మండల కేంద్రంలోని చారగొండ్ల మల్లయ్యకాలనీలోని లలిత ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగులగొట్టి ఇంట్లోని బంగారం, వెండి నగలు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య ఆధ్వర్యంలో స్పెషల్ టీం ఏర్పాటు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. శనివారం స్థానిక బస్టాండ్ సమీపంలో నిందితుడు సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి 13 తులాల బంగారం, 40 తులాల వెండి స్వాధీనం చేసుకున్నారు. చోరీ జరిగిన పది రోజుల్లోనే కేసును చేధించిన పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై పవన్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ రాజ్‌కుమార్, సూర్యప్రకాశ్‌లను డీసీపీ అభినందించారు.

## క్రీడలతో మానసికోల్లాసం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న శివరాజ్

జనగామ రూరల్: క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని మార్కెట్ చైర్మన్ బనుక శివరాజ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్టెన్ గ్రౌండ్‌లో నిర్వహించిన 50వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ క్రీడా పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ నాయకులు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన


సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియను శనివారం అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్ పరిశీలించారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి వసంత, ఎంపీడీఓ రాములు, హౌసింగ్ డీఈ సాయిరాంరెడ్డి, ఎంపీఓ రవీందర్ పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు నాగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రజాపోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో జరుగుతున్న జిల్లా మహాసభల్లో శనివారం రెండవ రోజు రాపర్తి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాగయ్య పాల్గొని మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకుండా నీరుగారుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి రైతాంగానికి స్వామినాథన్ కమిషన్ ప్రకారం గిట్టుబాటు ధరలను అమలు చేయాలని, ఫసల్‌బీమా యోజన రైతులకు అనుకూలంగా మార్చాలని, రైతాంగ రక్షణ కోసం దేశవ్యాప్తంగా రుణవిమోచన చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బూడిద గోపి, మునిగెల రమేష్, రాపర్తి సోమయ్య, రమేష్, సాంబరాజు, యాదగిరి, శేఖర్, చందునాయక్, విజేందర్, ధర్మభిక్షం, సురేష్‌నాయక్, వెంకటేష్, యాకయ్య, సోమన్న పాల్గొన్నారు.

## శబరిమలకు ఆర్టీసీ బస్సు


బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న డీఎం స్వాతి

జనగామ: జనగామ డిపోకు చెందిన డిలక్స్ బస్సు శబరిమల యాత్రకు బయలు దేరగా, ఆర్టీసీ మేనేజర్ ఎస్.స్వాతి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన 40 మంది అయ్యప్ప స్వాములు డిలక్స్ బస్సులో శబరిమలకు వెళ్లారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ కంచనపల్లి నుంచి కాణిపాకం, భావాని, పళని, గురువాయర్, బోటనిక్కర్, ఎరుమేలి మీదుగా పంబ(శబరిమలై) పుణ్యక్షేత్రానికి చేరుకుంటుందన్నారు. అక్కడ దైవదర్శన అనంతరం త్రివేండ్రం, కన్యాకుమారి, రామేశ్వరం, మదురై, శ్రీరంగం, అరుణాచలం, శ్రీకాళహస్తి క్షేత్రాల మీదుగా వచ్చే నెల 4వ తేదీన జనగామకు చేరుకుంటుందన్నారు. అయ్యప్ప స్వాములు శబరిమళ యాత్రకు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్), డి.హుస్సేన్, అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానిక్) జి.రాఘవేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ వై.యాదమణిరావు, ఎస్ఎం ఎం.సమ్మయ్య, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ వి.ప్రభాకర్, ఉద్యోగులు ఉన్నారు.

## క్లుప్తంగా

### అడ్రినల్ గ్రంథికి అరుదైన చికిత్స

- లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా కణతి తొలగింపు
- యురాలజిస్టు రాంప్రసాద్‌రెడ్డి



ఆపరేషన్ అనంతరం మానసతో డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా : అడ్రినల్ గ్రంథిలో ఏర్పడిన కణితిని అత్యంత క్లిష్టమైన లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా తొలగించి రోగి ప్రాణాలను నిలిపిన ఘటన హనుమకొండలోని వేయిస్తంభాల గుడి ఎదురుగా ఉన్న శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్‌లో శనివారం జరిగింది. యురాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి తెలిపిన వివరాలు.. కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన నాంపల్లి మానస కడుపునొప్పితో బాధపడుతూ అనేక ఆస్పత్రులలో తిరిగి వైద్యులను సంప్రదించింది. ఫలితం లేకపోవడంతో శ్రీనివాస కిడ్నీ సెంటర్‌ను ఆశ్రయించింది. వైద్య పరీక్షలు నిర్వహించగా మానసకు అడ్రినల్ గ్రంథిలో 14సెంటీ మీటర్ల కణతి, స్ప్లీన్, ప్యాంక్రియాస్, ఎడమ కిడ్నీకి అతుక్కుని ఉన్నట్లు గుర్తించారు. మూడు గంటలు శ్రమించి లాప్రోస్కోపిక్ పద్ధతి ద్వారా కణతిని తొలగించినట్లు, మిగతా అవయవాలకు ఎలాంటి నష్టం జరగకుండా చాలా జాగ్రత్తగా వ్యవహరించామని పేర్కొన్నారు. రోగి కోలుకోగా డిశ్చార్జి సైతం చేసినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. హైదరాబాద్ తర్వాత హనుమకొండలో ఇలాంటి ఆపరేషన్ చేయడం ఇదే తొలిసారి అని వివరించారు. ఆపరేషన్‌లో డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డితో పాటు అభినయ్, ప్రభురామ్, అనస్థీషియా వైద్యుడు సామ్రాట్ పాల్గొన్నారు.

### ఖోఖో టోర్నమెంట్‌కు కేయూ జట్టు



కేయూ క్యాంపస్: కోల్‌కతా యూనివర్సిటీలో ఈనెల 28న ప్రారంభమై 31 వరకు కొనసాగనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఖోఖో టోర్నమెంట్‌కు కాకతీయ యూనివర్సిటీ ఉమెన్ ఖోఖో జట్టు పాల్గొననున్నట్లు కేయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ వై.వెంకయ్య శనివారం తెలిపారు. ఈజట్టులో ఎం.నవ్య, ఎస్.నర్మద, పి.శిరీష, ఎం.సంధ్య, సీహెచ్ చైతన్య, పి.శ్వేత, బి.నిఖిత, సీహెచ్.హేమ, వి.స్నేహ, భీమారం, కె.దివ్య, ఎ.అనూష, ఎం.నిఖితాంజలి, ఎస్.సోనీ, కావ్య, టి.వర్షిత ఉన్నారు. ఈజట్టుకు కాకతీయ యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ ఎస్.కిరణ్ కుమార్‌గౌడ్ కోచ్‌కమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నట్లు వెంకయ్య తెలిపారు.



# ఒడిదొడుకుల సాగు

## ఈ ఏడాది రైతుకు కొంత లాభం.. కొంత నష్టం

రివైండ్ 2024


- అతివృష్టితో అతలాకుతలం
- తగ్గిన పత్తి, పెరిగిన వరి సాగు
- రుణమాఫీ, బోనస్‌తో ఊరట
- రైతుభరోసాకు ఎదురుచూపులు

సాక్షి, మహబూబాబాద్ : తొలకరి పలకరింపుతో సాగుబాట పట్టే వ్యక్తి అన్నదాత. దుక్కి దున్ని సిద్ధం చేయగానే కాలం కలిసి రావాలి.. పంటలు సమృద్ధిగా పండాలని ముందుగా భూమాతకు, తర్వాత ఇష్ట దైవానికి మొక్కుతారు.. అయితే ఇలా ప్రతీ ఏటా సాగిన రైతుసాగు ప్రయాణం ఈ ఏడాదంతా ఒడిదొడుకులుగా సాగింది. కాలం అయినట్టే అయ్యింది..అతివృష్టితో అంతా అతలాకుతలం చేసింది. చెరువులు, వాగులు తెగి పంట నీటిపాలైంది. పత్తి సాగును కాస్తా తగ్గించినా.. వరిసాగుపై దృష్టి పెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీ అయిన వారు సంబురపడ్డారు, కాని వారు ఎదురుచూస్తున్నారు. రైతుభరోసా ఊసే లేకపోవడంతో పెట్టుబడి కోసం ఇబ్బందులు పడ్డారు. సన్న ధాన్యానికి బోనస్‌తో కాస్తా ఊరట కలిగింది. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ ఏడాది 2024 సంవత్సరం సాగు ఇలా సాగింది..



### తగ్గిన దిగుబడి

అతి వృష్టితో జిల్లాలో ఆశించిన స్థాయిలో వరి, పత్తి దిగుబడి రాలేదు. ఎకరానికి 20 క్వింటాళ్ల మేరకు సగటున ఉమ్మడి వరంగల్ జిల్లాలో 20లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేయగా సన్న ధాన్యం దిగుబడి తగ్గి 14లక్షలకు దిగుబడి పరిమితం అయ్యింది. అదేవిధంగా పత్తి కూడా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 63లక్షల క్వింటాళ్ల మేరకు పత్తి దిగుబడి ఉంటుందని అంచనాలు వేయగా 3.5లక్షల క్వింటాళ్ల మేరకే దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. అయితే వరి, పత్తికి మద్దతు ధర ఉన్నా దిగుబడి తగ్గడంతో అన్నదాతలు నిరాశతోనే ఉన్నారు.



### నిండా ముంచిన వానలు

వానాకాలంలో ముందుగా వర్షం కురిసినా.. సెప్టెంబర్, అక్టోబర్ నెలలో అతి భారీ వర్షాలకు చెరువులు, కుంటలు తెగిపోయాయి. దీంతో అన్నదాత ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది. ప్రధానంగా ఉమ్మడి జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు జిల్లాల్లో మొత్తం లక్ష ఎకరాల వరకు పంట నష్టం సంభవించింది. అయితే ఇందులో సగం పంటకు మాత్రమే పరిహారం అందగా, మిగిలిన రైతులు నష్టపోయారు.పత్తి ఎర్రబారిపోయి.. ఎదగలేదు. మిర్చినారు దశలోనే మురిగిపోయింది. దీంతో పెట్టిన పెట్టుబడి రాక మళ్లీ విత్తనాలు కొనుగోలు చేయాల్సి వచ్చింది.

### వరి సాగుపై మొగ్గు



జూన్, జూలై నుంచే వర్షాలు పడడం, జలాశయాల్లో నీరు చేరడంతో రైతులు వరి సాగుపై మొగ్గు చూపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 15,71,359 ఎకరాల సాగు భూమి ఉండగా ఇందులో అధికంగా 9,05,818 ఎకరాలు అంటే 57శాతానికి మించి వరి పంటను సాగుచేశారు. అదే విధంగా 4,51,898 ఎకరాల సాగుతో పత్తి రెండో స్థానంలో నిలిచింది. అయితే 2023 వానాకాలం సీజన్‌తో పోలిస్తే లక్ష ఎకరాలకు పైగా పత్తి సాగు తగ్గి, వరి సాగు పెరిగినట్లు అధికారులు చెబుతున్నారు.ఈ ఏడాది సన్నాలకు క్వింటాకు రూ.500 బోనస్ అధికంగా ఇస్తామని ప్రభుత్వం ముందే ప్రకటించడంతో వరి సాగు పెరిగింది.

వానాకాలం పంటల సాగు ఇలా.(ఎకరాలు)

| జిల్లా | వరి | పత్తి | ఇతర పంటలు | మొత్తం సాగు |
|---|---|---|---|---|
| హనుమకొండ | 1,46,000 | 77,330 | 25,520 | 2,48,850 |
| మహబూబాబాద్ | 2,19,143 | 83,357 | 34,087 | 3,36,587 |
| భూపాలపల్లి | 1,05,000 | 25,000 | 85,398 | 2,15,398 |
| జనగామ | 2,09,000 | 1,25,000 | 18,593 | 3,52,593 |
| ములుగు | 95,737 | 20,740 | 14,023 | 1,30,500 |
| వరంగల్ | 1,30,938 | 1,20,47 | 36,022 | 2,87,431 |
| మొత్తం | 9,05,818 | 4,51,898 | 2,13,643 | 15,71,359 |





రైతు రుణమాఫీ ఇలా

| జిల్లా | రైతులు | రుణమాఫీ |
|---|---|---|
| మహబూబాబాద్ | 58,111 | రూ. 511కోట్లు |
| జనగామ | 54,458 | రూ. 469కోట్లు |
| హనుమకొండ | 43,127 | రూ. 472కోట్లు |
| భూపాలపల్లి | 37,235 | రూ. 560కోట్లు |
| వరంగల్ | 59,640 | రూ. 474కోట్లు |
| ములుగు | 24,477 | రూ. 201కోట్లు |



### రుణమాఫీతో ఆశ..నిరాశ

ప్రభుత్వం ప్రకటించిన రైతు రుణమాఫీలో కొంతమంది రైతులకే అర్హత ఉండడం, మరికొందరికి మాఫీ కాకపోవడంతో వచ్చిన వారిలో సంతోషం, రాని వారిలో ఎదురు చూపు మిగిలింది. రూ.2లక్షల లోపు రైతు రుణమాఫీలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 2,77,048 మంది రైతులకు రూ.2,689 కోట్ల మేర రుణాలు మాఫీ అయ్యాయి. అయితే రూ.2లక్షలకు పైగా రుణాలు ఉన్న 46వేలకు పైగా రైతులు రుణమాఫీ ఎప్పుడు అవుతుందో అని ఎదురు చూస్తున్నారు.

**పెట్టుబడికి తప్పని ఇబ్బంది**

గత ప్రభుత్వం రైతులకు ఏడాదికి రెండు సార్లు రూ.18,40కోట్లు రైతు బంధు పథకం ఇచ్చేది. కానీ 2024లో రైతులకు రైతుబంధు (రైతు భరోసా) రాలేదు. దీంతో పంటసాగుకు పెట్టుబడి కోసం మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్లాల్సి వచ్చిందని అన్నదాతలు చెబుతున్నారు.

## కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు
- నగరంలో కదం తొక్కిన నాయకులు, శ్రేణులు



సీపీఐ వందేళ్ల ఆవిర్భావ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు

వరంగల్ చౌరస్తా: కమ్యూనిస్టులే నిజమైన దేశభక్తులని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సమ సమాజ నిర్మాణమే సీపీఐ ధ్యేయం అన్నారు. పార్టీ ఆవిర్భవించిన వ్పటి నుంచి అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కమ్యూనిస్టులదే కీలక పాత్ర అని, నిలువ నీడలేని ఎంతో మంది పేదలకు భూములు, ఇళ్ల స్థలాలు ఇప్పించిన పార్టీ అని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేశ్, నాయకులు షేక్ బాషుమియా, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, బుస్సా రవీందర్, తోట చంద్రకళ, అక్కపల్లి రమేశ్, వీరగోని శంకరయ్య, కందిక చెన్నకేశవులు, గడ్డం యాకయ్య, ఓర్సు రాజు, ఎండీ అక్బర్, మేడిది అశోక్, తాళ్లపల్లి జాన్ పాల్, పరికరాల రమేశ్, జన్ను రవి, ఆరె రాజు, శరత్, మస్క సుధీర్, చింత కింది కుమారస్వామి, అయిత యాకుబ్, పాలక కవిత, గోవర్ధనాచారి తదితరులు పాల్గొన్నారు.

## దేశాభివృద్ధిలో రిసోర్స్ సెంటర్ల పాత్ర కీలకం

- యునైటెడ్ నేషన్స్ రిసోర్స్‌సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్విన్‌శర్మ



సదస్సులో మాట్లాడుతున్న అశ్విన్‌శర్మ

కేయూ క్యాంపస్: దేశాభివృద్ధిలో యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆ రిసోర్స్‌సెంటర్ (గౌహతి) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అశ్వినిశర్మ అన్నారు. శనివారం యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ నార్త్ ఈస్టర్న్ రీజియన్ తెలంగాణ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనంలో 'యునైటెడ్‌నేషన్స్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.ఈ సదస్సుకు ఆ రిసోర్స్‌సెంటర్ రాష్ట్ర సమన్వయ కర్త ధర్మపురి రాజగోవింద్ అధ్యక్షత వహించారు. అనంతరం అశ్విని శర్మ మాట్లాడుతూ..రిసోర్స్‌సెంటర్లు సమాచార ప్రసారం, సామర్థ్యం, అభివృద్ధి, పురోగతికి కేంద్ర బిందువుగా నిలుస్తున్నాయన్నారు. పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, వాతావరణం వంటి ప్రాధాన్యత లక్ష్యాలను అనుసంధానం చేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సదస్సులో ఎంజీఎం మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ వి.చంద్రశేఖర్, కేయూ హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కె.విజయబాబు, యునెస్కో ప్రతినిధులు, ఇతర ప్రముఖులు మాట్లాడారు.కాగా సదస్సు సందర్భంగా సెనేట్‌హాల్ వద్ద ఆర్ట్ ఎగ్జిబిషన్ ఏర్పాటుచేశారు.

## బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- బీసీ సంక్షేమ సంఘం
  ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్

హన్మకొండ: ఎన్నికల సమయంలో బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు జక్కని సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుడికాల భాస్కర్ అధ్యక్షతన జరిగిన దీక్షను వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్‌తో పాటు సీనియర్ జర్నలిస్టు గడ్డం కేశవమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హక్కుల సాధనకు, హామీల అమలుకు బీసీలంతా సంఘటితంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొనగాని యాదగిరి గౌడ్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందా మల్లయ్య, బీసీ సంరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఎదునూరు రాజమౌళి, బీసీ యూత్ గ్రేటర్ అధ్యక్షుడు ఏరుకొండ పవన్, బీసీ నాయకుడు కోలా ప్రతాప్, బీసీ ఆజాదీ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వ్యాసబట్టు మధుసూదనరాజు, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ జినుకల లక్ష్మణరావు, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## కుమార్తెకు విషమిచ్చి.. తాను తాగి

- ఆత్మహత్యకు యత్నించిన తల్లి



చికిత్స పొందుతున్న కుమార్తెను ఎత్తుకున్న తండ్రి శ్రీను

నల్లబెల్లి : కుటుంబ తగదాలు భరించలేక తనువు చాలించేముందు తన రెండేళ్ల కుమార్తెకు విషమించింది ఓ తల్లి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రుద్రగూడెం గ్రామానికి చెందిన పిండి శ్రీను–స్వరూప దంపతులకు సంతానం లేకపోవడంతో ఎనిమిదేళ్ల క్రితం తన అక్క కుమార్తె మానసను రెండో వివాహం చేసుకున్నాడు. వీరి దాంపత్య జీవితంలో కుమారుడు విఘ్నేష్, కుమార్తె సాత్విక జన్మించారు. కొన్నాళ్లు వీరికాపురం సజావుగానే సాగినా.. ఇటీవల వీరి కుటుంబంలో తరచుగా తగాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన మానస తన రెండేళ్ల కుమార్తెను వెంట పెట్టుకొని వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి యత్నించి తన కుమార్తెకు కూడా బలవంతంగా తాగించింది. గంట తర్వాత బావి నుంచి సమీపంలోని గుంటూరుపల్లి గ్రామానికి వెళ్లి జరిగిన విషయాన్ని గ్రామస్తులకు తెలియజేయడంతో 108 వాహనంలో నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రికి చేరుకుని తల్లి, కుమార్తెలను నర్సంపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. తల్లి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

## బతుకుదెరువు కోసం వెళ్లి.. అనంతలోకాలకు

- సైక్లిస్టును ఢీకొట్టిన కారు
- హైదరాబాద్‌లో ముత్యాలమ్మ తండావాసి దుర్మరణం



భర్త మృతదేహంపై పడి రోదిస్తున్న పార్వతి

కేసముద్రం : బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లిన, కేసముద్రం మండలం తావుర్యా తండా జీపీ శివారు ముత్యాలమ్మతండాకు చెందిన ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషాద సంఘటన శనివారం చోటుచేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం..ముత్యాలమ్మ తండాకు చెందిన గుగులోత్ గణేష్ (30) బతుకుదెరువు కోసం భార్య పార్వతితో కలిసి 8 నెలల క్రితం హైదరాబాద్‌కు వెళ్లారు. ఓ ప్రైవేట్ కంపెనీలో గణేష్ నైట్ వాచ్‌మెన్‌గా, పార్వతి కూలీ పనికి వెళ్తు జీవనం సాగిస్తూ తన ఇద్దరు పిల్లలను తొర్రూర్‌లోని హాస్టల్‌లో చదివిస్తున్నాడు. ఈ క్రమంలో గణేష్ విధులను ముగించుకుని సైకిల్‌పై తాను ఉంటున్న అద్దె ఇంటికి వెళ్తుండగా, మాదాపూర్ ఏరియాలో వెనక నుంచి వచ్చిన కారు ప్రమాదవశాత్తు సైకిల్‌ను ఢీ కొట్టింది. దీంతో కిందపడిన అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న భార్య, భర్త మృతదేహంపై పడి బోరున విలపించింది. బతుకుదెరువు కోసం వెళ్లిన గణేష్ కానరానిలోకాలకు వెళ్లాడనే విషయం తెలియడంతో తండాలో ఉంటున్న మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

# హోరాహోరీగా క్రీడాపోరు



హ్యాండ్‌బాల్ క్రీడాకారులతో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, నాగరాజు, మేయర్ సుధారాణి తదితరులు

- ఉత్సాహంగా సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు
- 33 జిల్లాలు.. 1,000 మంది క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్ : హనుమకొండలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. మొదటి విడతలో మూడు క్రీడాంశాల్లో పోటీలు జరుగుతుండగా అందులో జేఎన్ఎస్‌లో హ్యాండ్‌బాల్, సెపక్‌తక్రా, కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు కొనసాగుతున్నాయి.రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో స్టేడియం పరిసరాలు సందడిగా మారాయి. సుమారు 1,300ల మంది క్రీడాకారులకు ఐదు రోజుల క్రీడా పండుగకు అతిథ్యం అందజేసింది. క్రీడాకారులకు అన్ని వసతులు కల్పించినట్లు హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన సీనియర్ క్రీడాకారులు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా వసతులు, క్రీడల్లో పాల్గొనడం పై పలువురు క్రీడాకారులను సంతృప్తి వ్యక్తం చేశారు.

**ప్రతిభను వెలికితీసేందుకే క్రీడా పోటీలు: ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**

గ్రామీణ, పట్టణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి వారిని జాతీయస్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే లక్ష్యంగా క్రీడాపోటీలను నిర్వహిస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో కొనసాగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను శనివారం మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో కలిసి రాజేందర్‌రెడ్డి పర్యవేక్షించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని, వసతుల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కోచ్‌లు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.





పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

## ఆకట్టుకున్న నాటకాలు



నాటకంలోని ఓ సన్నివేశం

హసన్‌పర్తి: భీమారంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పందిళ్ల శేఖర్ బాబు స్మారక రాష్ట్ర స్థాయి నాటక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. రెండో రోజు జంధ్యాల సుబ్బలక్ష్మి రచనలో దేవరాజు రవీందర్‌రావు దర్శకత్వంలో రూపొందించిన విజయానిరుద్ధం పౌరాణిక పద్య నాటకం కనువిందు చేసింది. ఈనాటకానికి సురభి కొండల్‌రావు హార్మోనియం అందజేశారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర నాటక మాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హనుమకొండ జిల్లా నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ఒడపల్లి చక్రపాణి, యోగా గురువు పి. దయాకర్, కళాకారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.